## క్లుప్తంగా

### నేడు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యాంసుందర్ తెలిపారు. హైదరాబాదులోని వనస్థలిపురం మ్యాక్సీవిజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

నకిరేకల్ : కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం నకిరేకల్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నెమురుగొమ్మల రాంమోహన్‌రావు, అధ్యక్షుడిగా నెమురుగొమ్మల సూర్యచందర్‌రావు, కార్యదర్శిగా కొప్పుల నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా జెర్రిపోతుల శంకర్, కోశాధికారిగా పబ్బతి శ్రీశైలం ఎన్నికయ్యారు.

### 'మూసీ'ని ఆధునీకరించాలి

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టును ప్రభుత్వం ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చిన వెంకులు డిమాండ్ చేశారు. గురువారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూసీ ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను ఏళ్ల తరబడిగా తొలగించకపోవడంతో ప్రాజెక్టులో ఏటేటా నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి చివరి ఆయకట్టు భూములకు నీరందని పరిస్థితులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూటరీల నిర్వహణ పట్టించుకోకపోవడంతో ప్రధాన కాల్వలకు విడుదల చేసిన సమయంలో నీరు వృథాగా పోతోందన్నారు. కేతేపల్లిలోని 65 నంబరు జాతీయ రహదారి నుంచి మూసీ ప్రాజెక్టు మీదుగా బీసీ బాలుర గురుకుల పాఠశాల వరకు బీటీరోడ్డు నిర్మించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, ఎల్.రాజు, ఏళ్ల అశోక్‌రెడ్డి, కోట లింగయ్య, చెరుకు సత్తయ్య, కర్ర బాలయ్య, కూకుట్ల శోభన్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

### వీల్‌చైర్ బహూకరణ



వీల్‌చైర్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

చిట్యాల : మండల కేంద్రంలోని రోటరీ క్లబ్ వారు భవిత సెంటర్‌కు గురువారం రోటరీ క్లబ్ భువనగిరి జోన్-2 ప్రెసిడెంట్ వై.బుచ్చిరెడ్డి సహకారంతో వీల్‌చైర్ బహూకరించారు. కార్యక్రమంలో గుండెబోయిన సైదులు, కమలాపల్లి సత్యనారాయణ, ఎడ్ల శ్రీశైలం, కసిరెడ్డి రాజు, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు ఆవుల గీత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్తయ్య పాల్గొన్నారు.

### న్యాయవాదుల విధుల బహిష్కరణ


నకిరేకల్ : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదిపై పోలీసుల దాడిని ఖండిస్తూ గురువారం నకిరేకల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మున్సిఫ్ కోర్టులో విధులను బహిష్కరించారు. దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, న్యాయవాదులు మంగ సైదులు, నర్సిరెడ్డి, మనోహర్, మురళీ కృష్ణ, పాపయ్య, వెంకటరమణ, నాగరాజు, వెంకన్న, ఉదయ్ కుమార్, సంతోషా తదితరులు పాల్గొన్నారు.

### బండి సంజయ్ పుట్టినరోజు వేడుకలు

చండూరు : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలను గురువారం చండూరు మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరా గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నరసింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, జిల్లా అధికార ప్రతినిధి నకిరెకంటి లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌సీసీకి ఎంపిక

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఎన్‌సీసీ విద్యార్థినులను ఎంపిక చేశారు. జూనియర్ ఎన్‌సీసీ విభాగంలో తెలంగాణ 31 టీఎస్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీ అధికారులు సుబేదార్ సోహన్‌లాల్, హవల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బూక్య, ఎన్‌సీసీ శిక్షకురాలు నవనీత, స్టాఫ్‌నర్స్ అనిత తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థినులతో ఎన్‌సీసీ అధికారులు

# ఆందోళనలో పత్తి రైతులు

- ముఖం చాటేసిన వరుణుడు
- వాడిపోయే దశకు చేరుకున్న పత్తి మొక్కలు
- డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్న మోటార్లు ఉన్న రైతులు



వర్షాలు లేక వాడిపోయిన మునుగోడు శివారులోని ఓ రైతు పత్తి చేను

మునుగోడు: కొండంత ఆశతో పత్తి పంట సాగుచేసిన రైతులు సరైన వర్షాలు కురవకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సీజన్ ఆరంభంలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో రైతులు పత్తి పంట అధికంగా సాగు చేశారు. 20 రోజుల క్రితం కూడా ఓ మోస్తరు వర్షం కురవడంతో పత్తి పంట ఎదుగుదలకు అవసరమైన ఎరువులను సైతం పెట్టారు. కానీ 15 రోజులుగా వరుణ దేవుడు ముఖం చాటేయడంతో పత్తి పంట సాగుచేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

**డివిజన్ వ్యాప్తంగా 1,26,628 ఎకరాల్లో సాగు**

మునుగోడు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది 1,26,628 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. అందులో మునుగోడు మండలంలో 37,320 ఎకరాలు, చండూరులో 34,418, మర్రిగూడలో 24,390, నాంపల్లి మండలంలో 30,500 ఎకరాల చొప్పున సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది తక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. అందుకు ప్రధాన కారణం సరైన వర్షాలు కురవకపోవడం. గత ఏడాది డివిజన్ వ్యాప్తంగా మొత్తం 1,53,640 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది కూడా గతంలో కంటే అధికంగా సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కానీ వర్షాలు అంతంతమాత్రంగా కురవడంతో ఇంకా 58,170 ఎకరాల్లో ఏ పంటలు సాగు చేయకుండా సరిపడా వర్షం కురిస్తే పత్తి పంట సాగు చేసేందుకు దుక్కి దున్ని సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు సాగు చేసిన పంటలో కొందరు రైతులు కలుపు మొక్కలు తొలగించి వాటి ఎదుగుదలకు ఎరువులు వేశారు. మరికొంత మంది రైతులు ఎరువులు వేయకుండా వరుణ దేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

**డ్రిప్, పైపుల ద్వారా నీరు పెడుతున్న రైతులు**

చేను ఎదిగే సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు డ్రిప్, పైపులైను ద్వారా నీరు పారిస్తున్నారు. అదికూడా తమ వ్యవసాయ భూమిలో మోటార్లు ఉన్న రైతులు మాత్రమే. వ్యవసాయ మోటార్లు లేని రైతులు మాత్రం ప్రతిరోజు ఆకాశం వైపు చూస్తూ ఈ రోజైనా వర్షం కురిస్తే బాగుండని ఎదురుచూస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో వర్షం కురిస్తేనే తమ పంటలు ఎదిగి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, లేకపోతే పెట్టుబడితోపాటు తమ కష్టం బూడిదలో పోసిన పన్నీరులా మారుతుందని రైతులు వాపోతున్నారు.

**మొక్కల ఎదుగుదల ఆగిపోయింది**



15 రోజులుగా వర్షం కురవకపోవడంతో పత్తి మొక్కల ఎదుగుదల పూర్తిగా ఆగిపోయింది. సీజన్ ఆరంభంలో పంట సాగుకు అవసరమైన వర్షాలు కురవడంతో ఎకరానికి రూ.15వేలకు పైగా పెట్టుబడి పెట్టి పత్తి పంట సాగు చేశా. తీరా పంట ఎదిగే సమయంలో వర్షం కురవకపోవడంతో కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది.

– బొడ్డు యాదయ్యగౌడ్, రైతు మునుగోడు

**వారం రోజుల్లో వర్షం కురిస్తేనే మేలు**



నాకున్న ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. కానీ సరిపడా వర్షం కురవకపోవడంతో పత్తి పంట పూర్తిగా వాడిపోయే దశకు చేరుకుంది. మరో వారం రోజుల్లోపు వర్షం కురిస్తేనే పంట ఎదిగి దిగుబడి వస్తుంది. ఈలోపు వర్షం కురవకపోతే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా పోతుంది. వరుణ దేవుడు కరుణించాలని వేడుకుంటున్నా.

– నకిరెకంటి ప్రభాకర్, రైతు సోలిపురం

### ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం



మొక్క నాటుతున్న ఉద్యోగులు

నల్లగొండ: పానగల్ చౌరస్తాలో ఉన్న భగీరథ సర్కిల్‌లో గురువారం ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఇంజనీర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ డి.వెంకటేశ్వర్లు, టీజీఏ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ముజీబుద్దీన్, మధు, నరసింహ, సంపత్, రామకృష్ణ, రవి, సంతోష్‌రెడ్డి, రమేష్, గోకుల్ సాయి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండీ. సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ పట్టణంలో 552 ఇళ్లు నిర్మించిందని, డ్రెయినేజీ, విద్యుత్, మంచినీటి సౌకర్యం, అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదన్నారు. 2023 ఫిబ్రవరిలో డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ నేటివరకు వారికి ఇళ్లను స్వాధీనం చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ, సైదాచారి పాల్గొన్నారు.

### ఫుట్‌బాల్ బాలికల జట్టుకు జెర్సీలు అందజేత

నల్లగొండ: మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారిణులకు గురువారం ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి జెర్సీలు అందజేశారు. అనంతరం డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్ భగవద్గీత పుస్తకాలు, స్టీల్ వాటర్ బాటిళ్లను అందించారు. బండారు ప్రసాద్, కందగట్ల దాస్, సుమిత, హుస్సేన్, కరుణాకర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

### పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం

చిట్యాల : పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయం సాధించడంతో ఆయన ప్రధాన అనుచరుడు రాచమల్ల సంతోష్‌గౌడ్ బృందం పటాన్‌చెరువు నుంచి విజయవాడ వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం చిట్యాల మండలానికి చేరుకుంది. పాదయాత్ర బృందానికి గుండ్రాంపల్లిలో స్థానిక బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గరిసె రవికాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దగోని అంజన్‌కుమార్, గరిసె లింగస్వామి, నర్సింగ్, వెంకటేష్, గరిసె శ్రీనివాస్, జవాజి రమేష్, బొడిగె అంజయ్య, నర్సింహ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లికి చేరుకున్న సంతోష్‌కు బీజేపీ మండల నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్, మునుకుంట్ల గణేశ్, శ్రవణ్, మెడబోయిన శ్రీనివాస్, చిరుమర్తి వెంకన్న, నాగరాజు, నవీన్‌రెడ్డి, శివ తదితరులు ఉన్నారు.

### బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



లింగయ్య (ఫైల్)

మునుగోడు: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన చేపల వలలు అమ్మే వ్యాపారి నిమ్మల లింగయ్య(68) రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. వివరాలు.. లింగయ్య చేపలు, ఇతర జంతువులను పట్టే వలలను జిల్లాలోని పలు గ్రామాలతోపాటు ఇతర జిల్లాకు కూడా తన ద్విచక్ర వాహనంపై వెళ్లి అమ్మేవాడు. బుధవారం తన వలలు తీసుకొని నాగర్‌కర్నూల్ జిల్లాలో అమ్ముకునేందుకు వెళ్లాడు. అక్కడే బస చేసి తిరిగి గురువారం అచ్చంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్ముతూ తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో అచ్చంపేట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లింగయ్యకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు: మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. నాలుగు నెలల వేతనాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చండూరు మున్సిపల్ కార్మికులు ఈ నెల ఒకటో తేదీ నుంచి చేస్తున్నారు. ఎమ్మెల్యే హామీ మేరకు 9వ తేదీన కార్మికుల సమ్మె విరమించారు. కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం ఆయన మున్సిపల్ కేంద్రానికి వచ్చి కార్మికులతో మాట్లాడారు. మున్సిపల్ ఆదాయ, వ్యయాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించేలా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మణికరణ్, వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాత వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, కోడి గిరిబాబు, కోడి శ్రీనివాసులు, నల్లగంటి మల్లేశ్, మంచుకొండ సంజయ్, పల్లె వెంకన్న, ఇరిగి రాజు, మేకల సాగర్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

**ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి పెంచాలి**

మునుగోడు: కాలుష్యాన్ని నివారించి సకాలంలో వర్షాలు కురిసేందుకు ప్రతిఒక్కరూ ఒక మొక్క చొప్పున నాటి దానిని సంరక్షించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆ పాఠశాల స్థితిగతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు లేవని చెప్పడంలో వెంటనే 10 మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ పూజ, ఏపీఓ శ్రీనయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి**

మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. గురువారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఎన్ని సబ్‌స్టేషన్లు అవసరం ఉన్నాయి, ఎక్కడెక్కడ నూతన లైన్లతోపాటు లూజ్ లైన్ల మరమ్మతులు చేయించాలి, వాటి వివరాలు పూర్తిగా సేకరించి 10 రోజుల్లో తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. అంతకు ముందు నారాయణపురం, చౌటుప్పల్ మండలాల మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా విద్యుత్‌శాఖ ఎస్సీలు చంద్రమోహన్, శ్రీనాథ్, చౌటుప్పల్, నల్లగొండ, దేవరకొండ డీఈలు విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ఒడిబియ్యం



కనగల్ : అమ్మవారికి సమర్పించడానికి ఒడిబియ్యం తీసుకువచ్చిన మహిళలు

కనగల్ : దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం నల్లగొండ పట్టణానికి చెందిన 40మంది మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు వనమా పారిజాత, వందనపు జ్యోతి, సోమవరపు సమంత, రమ, లీలా, సరోజ, సునిత, జ్యోతి, భాగ్య, కవిత, రాణి, సుమతి, శోభ, సరస్వతి, కల్పన, పద్మ పాల్గొన్నారు.

**నకిరేకల్‌లో..**

నకిరేకల్ : మన అమ్మ మన సారె కార్యక్రమంలో భాగంగా నకిరేకల్‌లోని డాక్టర్స్ కాలనీలో మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. కాలనీ నుంచి మహిళలు శివాలయానికి ఒడి బియ్యం తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బ్రహ్మదేవర పద్మావతి, సూదిని మాలతి, గర్రె ఝాన్సీ, రావిరాల కవిత, చల్ల రమాదేవి, వెంకటలక్ష్మీ, మాలతి, కాసర్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా

నల్లగొండ టౌన్: ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగుల ఆందోళనను కవరేజీ చేస్తున్న ఓ న్యూస్ ఛానెల్ సిబ్బందిపై దాడి చేసిన సీఐపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే నాయకులు కోరారు. ఈ సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ చౌరస్తా వద్ద సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. దాడులు చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గార్లపాటి కృష్ణారెడ్డి, సల్వాది జానయ్య, దోటి శ్రీనివాస్, జూలకంటి అశోక్‌రెడ్డి, వరకాంతం కిరణ్‌కుమార్, కోటగిరి రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, గాదె రమేష్, వీరస్వామి, దండంపల్లి రవి, రామకృష్ణ, మల్లేష్, వీరలాల్, సలీం, శంకర్, మధు, శ్రీను పాల్గొన్నారు.

### ప్రతీ పోలీస్ వాహనం కండీషన్‌లో ఉండాలి



పోలీస్ వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం : ప్రతీ పోలీస్ వాహనం కండీషన్‌లో ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ వాహనాల కండీషన్‌ను ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి పరిశీలించారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న వాహనాలను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.

### 'ప్రభుత్వ వైఖరి బాధాకరం'

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని బీఆర్ఎస్వీ నియోజకవర్గ కార్యదర్శి సుంకరి మల్లేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. టెట్, డీఎస్సీ స్వల్ప కాల వ్యవధిలో నిర్వహించడం వల్ల అభ్యర్థులు నష్టపోతారని, తక్షణమే డీఎస్సీ వాయిదా వేసి 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్య, వైద్య సౌకర్యాల్లో లోటుపాట్లు ఉండొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- తిప్పర్తి పీహెచ్‌సీ, కేజీబీవీ తనిఖీ



తిప్పర్తి పీహెచ్‌సీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రామగిరి(నల్లగొండ): పేద ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు, మందుల స్టాక్, ల్యాబ్ టెస్టుల రిజిస్టర్లను పరిశీలించారు. కేజీబీవీలో సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లు, విద్యార్థినులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్‌తో సహా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ల్యాబ్ రిపోర్టులను ఎప్పటికప్పుడే పేషెంట్‌కు పంపించాలన్నారు. అనధికారికంగా విధులకు గైర్హాజరైన ఫార్మసిస్ట్‌పై చర్య తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. సకాలంలో ల్యాబ్ రిపోర్టులు పంపించని ల్యాబ్ టెక్నీషియన్ పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించని సిబ్బందిపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మాడుగులపల్లి మోడల్ స్కూల్‌ను తిప్పర్తి కేజీబీవీ ఇంటర్ భవనంలో నిర్వహించడం వల్ల వసతి ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వేములపల్లి మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌కు మార్చాలని డీఈఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఎంపీడీఓ, తహసీల్దార్ ఉన్నారు.

**కలెక్టర్‌కు వినతి**

నల్లగొండ టూటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టర్ నారాయణరెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. పెన్షనర్లకు నగదురహిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ విడుదల చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు జి.దామోదర్ రెడ్డి, జిల్లా శ్రీశైలం, గాయం నారాయణరెడ్డి, నూనె రంగయ్య, రామలింగం, ఆర్.అమృతారెడ్డి, యుగంధర్ రెడ్డి, ఆంజనేయులు, యాదగిరి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కనగల్ : దర్వేశిపురంలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఏఓ అమరేందర్‌గౌడ్

కనగల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ జయరాం అన్నారు. గురువారం మండల పరిధిలోని పర్వతగిరి, బచ్చన్నగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సంకు హరి, హెచ్ఎం విజయ్‌ప్రసాద్, సీసీలు తదితరులున్నారు. అదేవిధంగా మండల రేగట్టె ఉన్నత పాఠశాల, దర్వేశిపురం పాఠశాలల్లో జరుగుతున్న పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఏపీఎం హరి పరిశీలించారు. అనంతరం దర్వేశిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో మండల వ్యవసాయాధికారి అమరేందర్‌గౌడ్‌తో కలిసి విద్యార్థులకు దుస్తులు అందజేశారు.

**ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య**

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని పులిపలుపుల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం డి.కళావతి అన్నారు. గురువారం మండలంలోని పులిపలుపుల గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న సమయంలో భోజనం, రెండు జతల యూనిఫామ్ అందజేస్తామని చెప్పారు. దీంతో నలుగురు విద్యార్థులను వారి తల్లితండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూసుఫ్ పాష, వై.వెంకటయ్య, బి.రవీందర్, నాగరాజు, జై.స్వామి, మేరి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పంట రుణాలు మాఫీ చేయాలి



మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

చండూరు : రాష్ట్రంలోని రైతులు 2018 సంవత్సరం కంటే ముందు తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చండూరులోని సీపీఐ కార్యాలయం మాదగోని నరసింహ భవనంలో బొల్గూరి నరసింహ అధ్యక్షతన జరిగిన మునుగోడు నియోజకవర్గ సీపీఐ మండల కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతు రుణమాఫీతోపాటు, రైతు భరోసా ఎకరానికి రూ.15000 ఇవ్వాలని, నూతన రేషన్ కార్డులు, అర్హులైన వారందరికీ పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి మునుగోడు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చండూరు మండలంలో చిన్ననీటి వనరులైన బెండలమ్మ చెరువు, శేషిలేటి వాగు ఫీడర్ చానల్, వెల్మకన్నె ఫీడర్ చానల్‌లను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య, ఆర్ అంజాచారి, తీర్పారి వెంకటేశ్వర్లు, గురిజా రామచంద్రం, మండల కార్యదర్శులు నలపరాజు సతీష్‌కుమార్, చాపల శ్రీను, ఈదుల భిక్షంరెడ్డి, సూదన బోయిన రమేష్, పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, సూర్గి చలపతి, బూడిద సురేష్, బరిగెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్: మండలంలోని మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నందిపాటి అంజయ్యకు చెందిన గుడిసె ఇటీవల కాలిపోయింది. గుడిసెలో ఉన్న టీవీ, దుస్తులు, ఇతర నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ బాధితుడు అంజయ్యను పరామర్శించి గురువారం 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా కోమటిరెడ్డి నర్సింహారెడ్డి 5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

**ఫొటోగ్రాఫర్‌కు..**

నల్లగొండ: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ పెరిక గణేశ్ ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నల్లగొండ పట్టణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం గణేశ్ ఇంటికి వెళ్లి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కంభంపాటి రవి, దాసపత్రి జనార్దన్, పెరిక నాగరాజు, సామల వెంకటేశ్వర్లు, గంధం రూపేంద్రకుమార్, ధనుంజయ గౌడ్, శ్యామల తుకారాం పాల్గొన్నారు.

**మునుగోడులో..**

మునుగోడు: మండలంలోని పులిపలుపుల గ్రామానికి పందుల భిక్షపతి అనారోగ్యంతో మృతి చెందాడు. భిక్షపతి మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దోటి నారాయణ గురువారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కంభంపాటి వెంకటయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ రఫీక్, అంజయ్య, కంభంపాటి సైదులు, వెంకన్న, మునుగోటి యాదగిరి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

**అంధురాలికి..**

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన అంధురాలు బొడ్డుపల్లి ధనమ్మకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్ గురువారం రూ.ఐదువేల ఆర్థికసాయం అందజేశాడు. రెండు కళ్లు కోల్పోయి ఎలాంటి ఆధారం లేకుండా జీవిస్తున్న ధనమ్మకు ఆసరా పెన్షన్ కూడా రావడం లేదు. తనకు పెన్షన్ ఇప్పించాలని పలుమార్లు మండల అధికారులను ధనమ్మ వేడుకుంటూ వస్తోంది. గమనించిన శేఖర్.. ఖర్చుల నిమిత్తం ధనమ్మకు నగదు అందజేశారు.

### రైతుల సమస్యలపై సర్వే



సమస్యలు తెలుసుకుంటున్న రైతు సంఘం నాయకులు

చండూరు : కౌలు రైతులకు రుణ గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల పరిధిలోని కొండాపురం, నెర్మట గ్రామాల్లో కౌలు రైతుల సమస్యలపై సర్వే నిర్వహించారు. పంట రుణాలు, రైతుబంధు అందజేయాలని, రుణ మాఫీ చేయాలని సర్వే బృందానికి కౌలు రైతులు వివరించారు. కార్యక్రమంలో జె.ధనుంజయగౌడ్, ఉప్పునూతల చంద్రయ్య, వెంకన్న, మల్ల య్య, యాదయ్య, వీరమల్ల అంజయ్య, అయితగోని యాదయ్య, సత్తయ్య, లింగయ్య, లవకుశ, ఏ సత్తయ్య, గాలెంక కృష్ణయ్య, కొంపల్లి శంకర్, బి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగలు తొలగించాలని వినతి

చిట్యాల : గుండ్రాంపల్లిలో నివాస గృహాలపై ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతూ గురువారం గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి కత్తుల యాదయ్య, జోగు లక్ష్మయ్య, రమేష్, సత్తయ్య, ముత్తయ్య, లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

**అధికారులు చొరవ చూపాలి**

మర్రిగూడ : కలెక్టర్ ఆదేశానుసారం ప్రజావాణి కార్యక్రమం మర్రిగూడ మండల వ్యాప్తంగా గురువారం కొనసాగింది. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని ఎంపీఓ రవికుమార్ సూచించారు.